క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



తైక్వాండో క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి విద్యార్థులను అభినందించారు. ఈనెల 4న కర్నూలులో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్–14 విభాగంలో తైక్వాండోలో వంశీ, శివగౌతమ్, హన్సిక, శివపావని, అండర్–17 విభాగంలో అఖిల్‌ప్రకాశ్, మహమ్మద్ ఆఫ్రిద్, వెంకటదివ్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీడీ దేవేంద్ర, ఉపాధ్యాయులు రమణయ్య, కవిత, రవిప్రకాశ్, చెన్నయ్య, నరసింహ, పుల్లయ్య, శిశ్వనాథ్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

ఉయ్యాలవాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థిని, విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. సమావేశంల ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌లు కోరారు.

శనగ విత్తనాలు కేటాయింపు

ఉయ్యాలవాడ:రబీ సీజన్‌లో పప్పు శనగ సాగు చేసే రైతులకు మండలానికి 1,500 క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలు ప్రభుత్వం కేటాయించిందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ క్వింటా రూ. 7,800లు కాగా 25 శాతం సబ్సిడీతో రైతులకు రూ.5,750కు సరఫరా చేస్తామన్నారు. 5 ఎకరాల వరకు 10 ప్యాకెట్ల చొప్పున అందిస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పాసుపుస్తకం, మొబైల్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 14 వేల హెక్టార్లలో శనగ పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. విత్తనాల కొరత లేకుండా మండలానికి అదనంగా మరో 1,500 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

శిరివెళ్ల: ఆరోగ్యమే మహాభాగ్యమని జీసీడీఓ నాగసువర్చల అన్నారు. బుధవారం కస్తూర్బా పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. మానసిక ప్రశాంతతతో శారీరక ఆరోగ్యం కూడా బాగుతుందన్నారు. కోపం, చికాకు, బాధలు మానసిక ప్రశాంతను దెబ్బతీస్తాయన్నారు. దీర్ఘాలోచనలు చేయకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సైకాలజీ కౌన్సిలర్ విజయ్, ప్రిన్సిపాల్ జ్యోతి, టీచర్లు పాల్గొన్నారు.

యర్రగుంట్లలో భూ రీసర్వే ప్రారంభం



రైతుల సమక్షంలో కొలతలు వేస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: యర్రగుంట్ల గ్రామ పంచాయతీలో భూ రీసర్వే ప్రారంభమైంది. పంచాయతీ పరిధిలోని మొదటగా వెంకటాపురంలో రెవెన్యూ సిబ్బంది సర్వే చేపట్టారు. సచివాలయాల సర్వేలందరూ టీమ్‌ల వారీగా సర్వేలో ఉన్నారు. పంచాయతీ పరిధిలో 3.914 ఎకరాలు పొలం ఉంది. ఏడు రకాల రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే జరుగుతోంది. మండలంలో ఇప్పటికే మహదేవాపురం, గుండంపాడు, గంగవరం, జీనేపల్లె, కామినేనిపల్లె, కోటపాడు, గోవిందపల్లెలో సర్వే పూర్తయింది. మండల సర్వేయర్ చిన్న మల్లయ్య సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

గోస్పాడు వాసికి బంగారు పతకం



బంగారు పథకాన్ని అందుకుంటున్న ప్రభాకర్

గోస్పాడు: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2023–25 మధ్య కాలంలో విద్యా మాస్టర్ కోర్సులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గోస్పాడు వాసి మిద్దె ప్రభాకర్‌కు బంగారు పతకం దక్కింది. ఈనెల 7న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన 25వ పట్టభద్రుల సభలో ఆయనకు ఈ పతకం అందజేశారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ నరసింహా రెడ్డి, వైస్ చాన్స్‌లర్ బీజే రావు, డీన్లు, ఆచార్యుల ఆధ్వర్యంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ పతకాన్ని అందుకున్నారు.



గుండుపాపల గ్రామంలో బెండ పంటలో నిలిచిన నీరు



దబ్బు గోవిందిన్నె గ్రామంలో మొక్కజొన్న పరిస్థితి ఇలా

కష్టం తడిచి.. కన్నీరు మిగిలి!

వరుణుడు ఈ ఏడాది రైతులను నిండా ముంచేశాడు. చేతికొచ్చిన పంట దిగుబడులు పొలంలోనే కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. రైతుల కష్టం నీటి పాలైంది. మూడు నెలలుగా వెంటాడుతున్న వర్షాలకు రైతులు భారీగా నష్టపోయారు. పంట సాగుచేసినప్పటి నుంచి వానలు కురుస్తుండటంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. ప్రస్తుతం బెండ, మొక్కజొన్న పంటలు కోతదశలో ఉన్నాయి. కానీ పంటలు మాత్రం నీటి మడుగుల్లో చిక్కుకున్నాయి. దీంతో కోత పనులు జరగక రైతులు ఇబ్బందులు పడతున్నారు. చేతికొచ్చిన పంట ఇంటికి చేరక పోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. కంది, మినుము పంటల్లో కలుపు ఏపుగా పెరిగి బీళ్లుగా మారాయి. దీంతో రైతులకు కూలీల ఖర్చు తడిసిమోపడవుతున్నాడు. – దొర్నిపాడు

జొన్న సాగు షురూ!



జొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

శిరివెళ్ల: రబీ సీజన్‌కు సంబంధించి జొన్న సాగు మొదలైంది. రైతులు విత్తనాలు వేయడంలో బిజీబిజీగా ఉన్నారు. తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పొలాలు ఆరక పోవడంతో ఈ ఏడాది 15 రోజులు ఆలస్యంగా విత్తన పనులు మొదలయ్యాయి. మండలంలో అత్యధికంగా గుంప్రమాన్‌దిన్నె, రాజనగరం, గాంధీనగరంలో 2,400 ఎకరాలు, జీనేపల్లె, పార్వతీపురంలో 985 ఎకరాలు, యర్రగుంట్లలో 357 ఎకరాల్లో జొన్న విత్తనాలు వేస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జొన్న కోతలు ప్రారంభం కానున్నాయి.

పర్యావరణాన్ని సంరక్షిద్దాం

నంద్యాల (వ్యవసాయం): పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ సంరక్షించాలని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫారుక్ అన్నారు. నంద్యాల శివారులోని స్వర్గధామంలో బుధవారం మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గధామం అభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానన్నారు. స్వర్గధామంకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డు వచ్చేందుకు కృషి చేసిన వైద్యుడు మధుసూదన్‌రావును మంత్రి అభినందించారు. న్యాయవాది రామచంద్రరావు, డాక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. దాతల సహకారంతో సర్గధామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రాజశేఖర్, హరి పాండురంగయ్య, సత్యనారాయణ, బాబురావు, రాంప్రసాద్, మధు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



స్వర్గధామంలో మొక్కలు నాడుగున్న మంత్రి ఫరూక్

జస్టిస్ గవాయిపై దాడిని సర్వత్రా ఖండించాలి



నంద్యాల: గాంధీచౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



గోస్పాడు: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జస్టిస్ బీఆర్ గవాయిపై దాడిని సర్వత్రా ఖండించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, క్రిస్టియన్ జేఏసీ నాయకులు పుల్లా నరసింహులు, జానయ్యలు అన్నారు. బుధవారం పట్టణంలోని నంద్యాల గాంధీ చౌక్‌లో జస్టిస్ గవాయ్‌పై దాడిని వ్యతిరేకిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిని తీవ్రంగా శిక్షించాలన్నారు. దేశంలో బీజేపీ పాలనలో దళిత, మైనార్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు చిరు, విజయ్, కిరణ్ భాను, తిరుపాలమ్మ, వెంకటేశ్వర్లు, అంకాలరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

గోస్పాడు: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై బూటు విసిరిన మతోన్మాది న్యాయవాది రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి దేశ బహిష్కరణ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, ఓబుళపతి అన్నారు. బుధవారం గోస్పాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యాక్రమాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సనాతనం పేరుతో న్యాయవాదికి రాకేష్ కిషోర్ బూటు విసరడం రాజ్యాంగ సంస్థలను అవమానపరచడమేనన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలమద్దిలేటి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభను విజయవంతం చేయాలి..

ఈనెల 12న నంద్యాల పట్టణంలో జరిగే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, సుబ్బరాయుడు అన్నారు. మండల కేంద్రమైన గోస్పాడులో బుధవారం సభ వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తరలి రావాలని పిలుపునిచ్చారు.

లౌకిక, సామ్యవాదం పదాలను తొలగించొద్దు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పలు సంఘాల నాయకులు

నంద్యాల(అర్బన్): భారత రాజ్యాంగం నుంచి లౌకిక, సామ్యవాదం పదాలను తొలగించొద్దని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రైస్తవ మైనార్టీ కర్తవ్యమన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిష్టియన్, ముస్లిం మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బొమ్మల సత్రం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయా సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర నాయకులు కడియం సాంబశివుడు, దళిత సంఘం నాయకులు అనిల్ అమృతరాజు తదితరులు మాట్లాడుతూ.. రాజ్యాంగం నుంచి లౌకిక, సామ్యవాదం పదాలు తొలగించరాదన్న డిమాండుతో కాన్సీరాం వర్ధంతి సందర్భంగా ఈనెల 9న విజయవాడ ధర్నా చౌక వద్ద నిరసన కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. మైనార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై సనాతన న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసిరిన అమానుష దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇది రాజ్యాంగం భారత న్యాయ వ్యవస్థపైదాడి అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగే వరుస దాడులకు పరాకాష్ట అన్నారు. కార్యక్రమంలో బాబా ఫక్రుద్దీన్, మన్నెం జానయ్య, మరియదాసు, నర్సయ్య యాదవ్, సోమన్న, మస్తాన్ ఖాన్,దేవదాసు, చెన్నయ్య,వడ్డెసురేష్,షఫీ, సలీం, వేణు పాల్గొన్నారు.

అరటిలో సిగ తోక మచ్చ తెగులు



చిన్నవంగలి గ్రామంలో అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త దీప్తి, అధికారులు

చాగలమర్రి/రుద్రవరం: అరటి పంటకు సిగతోక మచ్చ తెగులు వ్యాపించిందని, సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టడంతో నివారించవచ్చునని ఉద్యాన శాస్త్రవేత్త దీప్తి అన్నారు. బుధవారం ఉద్యావన శాఖ అధికారి దస్తగిరి ఆధ్వర్యంలో చిన్నవంగలి గ్రామంలో అరటి, పసుపు, బొప్పాయి పంటలను ఆమె పరిశీలించారు. అలాగే రుద్రవరం మండలం ఆలమూరులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో అరటి పంటలో సిగతోక మచ్చ తెగులు సోకిందని ఈ తెగులు ఆగస్టు నుండి నవంబర్ నెల వరకు వివిధ దశలలో ఆశిస్తుందన్నారు. దీనికి కారణం గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం, పంట పోలాల్లో మురుగు నీరు బయటికి వెళ్లే సౌకర్యం లేకపోవడం, నత్రజని ఎక్కువ శాతం, పోటాష్ తక్కువ శాతం వినియోగించడంతో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుందన్నారు. మొదట లేత పసుపు రంగులో మచ్చలు ఏర్పడి మధ్యలో పాచి రంగుతో పసుపు వలయాలతో క్రమేపి పెద్దగా మారి ఆకు ఇనేల వెంట మచ్చలు ఏర్పడటం తెగులు లక్షణాలన్నారు. ఈ తెగులు నివారణకు లీటర్ నీటికి మంకజబ్ 2.5 గ్రాములు లేదా క్లోరోతలోనిల్ 2 గ్రా.. లేదా కార్బెండజిమ్ 1 గ్రా.. పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో నవ భారత్ సీడ్ కంపెనీకి చెందిన అధికారి వెంటరెడ్డి, ఏఓ రంగనేతాజి, వీహెచ్ఏ ఫరూఖ్, రైతులు రామగుర్విరెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, రుద్ర వరం వ్యవసాయాధికారి సుమతి, విస్తరణ అధికారి రాజు, వీఏఏలు శ్రావణి, ఫణిరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



శ్రీశైలం టెంపుల్ : శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై హైదరాబాదుకు చెందిన రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహా గణపతి, శివ శివ శంకరా, నమఃశివాయతే, భో.. శంభో తదితర గీతాలకు రాజ్యలక్ష్మి, సుకృతి, కల్పన, స్వర్ణలత, శ్రీదేవి, జమున, దివ్యశ్రీ, తేజ జ్ఞాన సహస్ర, శ్రీలక్ష్మి, అక్షర, రమ్య తదితరులు నృత్యం ప్రదర్శించారు

రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తరించాలి

- డీఆర్‌వో రామునాయక్
- రెండవసారి చైర్మన్‌గా దస్తగిరి ఎన్నిక



రెడ్‌క్రాస్ నూతన కమిటీతో ప్రమాణం స్వీకారం చేయిస్తున్న డీఆర్‌వో రామునాయక్

నంద్యాల: రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తరించాలని డీఆర్‌వో రామునాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఏజీఎం సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఇన్‌చార్జ్ రెడ్ క్రాస్ చైర్మన్, డీఆర్‌ఓ రాము నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు రెడ్‌క్రాస్ కార్యకలాపాలను బలోపేతం చేయడం, సమాజ సేవలను విస్తరించడం లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పాత కమిటీలోని కొంతమంది సభ్యులతో పాటు పట్టణంలోని ప్రముఖ వైద్యులను, విద్యాసంస్థల ప్రతినిధులను చేర్చి కొత్త కమిటీని రూపుదిద్దారన్నారు. ఈ ఎన్నికల్లో రెండవసారి చైర్మన్‌గా దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్‌గా డాక్టర్ మమతారెడ్డి, కోశాధికారిగా డి. నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన మేనేజ్‌మెంట్ కమిటీలో డాక్టర్ ఆరిఫా బాను, డాక్టర్ నిషితా రెడ్డి, డాక్టర్ నెరవాటి అరుణకుమారి, ఉస్మాన్‌బాషా, పేరుసోముల నరసింహమూర్తి, తెలకపల్లి రాధాకృష్ణయ్య, శ్రీశైలం నాగశేషయ్య, యాకూబ్ తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర కోశాధికారి రామచంద్ర రాజు అబ్జర్వర్‌గా హాజరయ్యారు. కర్నూలు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ జేసీ. గోవిందరెడ్డి, రెడ్ క్రాస్ ప్రస్తుత జిల్లా సెక్రటరీ, కలెక్టరేట్ ఏఓ శుభకర్, జిల్లా కోఆపరేటివ్ డివిజన్ అధికారి (ఎన్నికల అధికారి) జానకిరాముడు, సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించే దిశగా కృషి చేస్తామన్నారు. ప్రతి కాలేజీ, ప్రతి పాఠశాలలో జూనియర్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్లను ఏర్పాటు చేస్తామనానరు. విపత్కర పరిస్థితుల్లో సహాయక సైన్యంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యంమన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఆశాజ్యోతి



ఆశాజ్యోతిని సన్మానిస్తున్న దృశ్యం

చాగలమర్రి: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆశాజ్యోతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమెను ఎంఈఓలు అనురాధ, సయ్యద్ న్యామతుల్లా, హెచ్‌ఎం జీవయ్య తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో చింతలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ దాదాపీర్, వ్యాయామ ఉపాధ్యాయులు కె.శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, భారతి, శ్రీనివాస మూర్తి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలి

రుద్రవరం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని తహసీల్దారు ఆల్ఫ్రెడ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వీఆర్వో సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

పేలిన 108 అంబులెన్స్ టైర్



టైరు పేలడంతో బండి ఆత్మకూరు వద్ద ఆగిపోయిన 108 వాహనం

బండి ఆత్మకూరు : ప్రాణాపాయస్థితిలో ఉన్న వృద్ధుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో 108 అంబులెన్స్ టైరు పేలి గంటల కొద్దీ రోడ్డు మీద నిరీక్షించాల్సిన పరిస్థితి మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన బిల్లా బక్కన్న అనే వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో వెలుగోడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ క్రమంలో బండి ఆత్మకూరు సమీపంలోకి రాగానే వాహనం వెనక టైరు పేలడంతో అంబులెన్స్ ఆగిపోయింది. దీంతో వెంటిలేటర్‌పై ఉన్న వృద్ధుడి పరిస్థితి ఆందోళన కలిగించింది. సిబ్బంది ఆయనకు చికిత్స కొనసాగిస్తూ మరో వాహనం కోసం సమాచారం అందించారు. గంట లోపు మరో అంబులెన్స్ రావడంతో వృద్ధుడిని అందులోకి ఎక్కించి నంద్యాలకు తరలించారు. 108 వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని బాధితుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆగిన అంబులెన్స్‌లో వెంటిలేటర్ మీద ఉన్న బక్కన్న

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థినులకు వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

చాగలమర్రి: వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని రుద్రవరం రేంజ్ అటవీశాఖాధికారి ముర్తుజావలి అన్నారు. బుధవారం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వన్యప్రాణి వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తే వాటికి హాని తలపెట్టవద్దని, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు, ఉచ్చుల లాంటివి ఏర్పాటు చేయకుడదని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డి.వనిపెంట సెక్షన్ అధికారి టి. రామకృష్ణ ఎఫ్‌ఎస్‌ఓలు శ్రీనివాసులరెడ్డి, రాణెమ్మ, మాబూఖాన్, ఎఫ్‌బీఓలు నాగ ఉశేనయ్య, మదన్‌గోపాల్, ఈ.సురేంద్రగౌడ్, జే. శుభాష్, వి. జేమ్స్‌పాల్, ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదాయ పెంపుపై దృష్టి సారించాలి



చాగలమర్రి: శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తాహెర్ హుస్సేన్

ఉయ్యాలవాడ : ప్రతి గ్రామ పంచాయతీ సొంత వనరుల ద్వారా పెంచుకోవడానికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమష్టిగా కృషి చేయాలని మాస్టర్ ట్రైనర్లు సూచించారు. బుధవారం రెండవ రోజు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సొంత రెవెన్యూపై శిక్షణ తరగతులు కొనసాగాయి. ఇంటి పన్ను, నీటి పన్ను, ఫంక్షన్ హాల్లు, రైస్ మిల్లులు, వ్యాపార సముదాయాలు, ధాన్యం నిల్వ చేసే గోడౌన్లు, మాంసం విక్రయాలు, తదితర వాటిపై పన్ను వసూల్లు దృష్టి పెట్టాలని మాస్టర్ ట్రైనర్లు రాజశేఖర్‌బాబు, సతీష్‌కుమార్, మాలతి, డిప్యూటి ఎంపీడీఓ నాగలక్ష్మమ్మలు శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు.

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా రెండో రోజు బుధవారం శిక్షకులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే బడ్జెట్ కాకుండా స్వతహగా ఆయా గ్రామ పంచాయతీల్లోఆదాయం పెంచుకునేందుకు అవసరమైన వనరులను గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల పరిషత్ ఉద్యోగులు షఫ్రక్, హరి కిషన్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ తాహెర్ హుస్సేన్ అధ్యక్షతన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సచివాలయ డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ విధులను బాధ్యతతో నిర్వహిస్తూ పంచాయతీ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలన్నారు. శిక్షలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): నకిలీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నాల సాయిరాంరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కల్తీ మద్యానికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చేశారన్నారు. కల్తీ మద్యం అమ్మకాల్లో దేశంలోనే నెంబర్‌వన్‌గా కూటమి ప్రభుత్వం ముందుందన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రానికి సంపద సృష్టిస్తానంటూ అనుచరులకు దోపిడీ మార్గం చూపెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాత్రి పగలు లేకుండా మద్యం అమ్మకాలను చేస్తున్నారన్నారు. కల్తీ మద్యం తయారీపై సమగ్ర విచారణ జరిపి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతిలో 23 నుంచి నవ చండీ హోమం



అమ్మవారిని దర్శించుకున్న నాగేంద్ర స్వామి

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి దేవి క్షేత్ర పరిధిలో ఈనెల 23 నుంచి నవ చండీ హోమం నిర్వహిస్తున్నట్లు అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం పీఠాధిపతి శివానందలాహరి స్వామి శిష్యుడు నాగేంద్ర స్వామి తెలిపారు. బుధవారం ఆయన కొలనుభారతి దేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విశ్వమానవాళికి ముక్తిని అమ్మవారు ప్రసాదించాలన్న అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమ పీఠాధిపతి కోరిక మేరకు ఈ హోమం నిర్వహించాలనుకున్నామన్నారు. ఈనెల 23, 24 వ తేదీల్లో ఆలయ ప్రాంగణంలో నవ చండీహోమం చేస్తామన్నారు. ఆయన వెంట శిష్యబృందం మునిచక్రవర్తి, శివరామకృష్ణ ఉన్నారు.

నేడు హుండీ లెక్కింపు

కొలనుభారతి దేవి ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రామలింగారెడ్డి బుధవారం తెలిపారు. గడిచిన నాలుగునెలలుగా హుండీలో భక్తులు వేసిన కానుకలు, వీరాశాలను లెక్కిస్తామన్నారు. ఆశక్తిగల భక్తులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.